

తాడో పేడో..

- పొర్లు దండాలు, సాష్టాంగ నమస్కారాలు, మానవహారం
- 31వ రోజు సమ్మెలో అంగన్వాడీల వినూత్న నిరసనలు
- పట్టించుకోకుంటే తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తామని హెచ్చరిక

- 6లో..

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు





పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక).

సీట్లు సర్దు 'పోట్లు'

- వైసీపీలోకి నల్లగట్ల స్వామిదాసు
- నేడు వైసీపీకి తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి గుడ్‌బై
- నేడు చంద్రబాబును కలవనున్న పార్థసారథి
- 3వ జాబితాలో పెనమలూరు, పెడన సీట్ల ఖరారు
- పెనమలూరు జోగి రమేశ్‌కు.. పెడన ఉప్పాల రాముకు..
- విజయవాడ ఎంపీ స్థానానికి కేశినేని నాని..
- వైసీపీలో చేరిన గంటల్లోనే స్వామిదాసుకు దక్కిన హామీ

వైసీపీలో సీట్ల సర్దుబాటు అధిష్ఠానానికి పెద్ద తలపోటే తెస్తోంది. కేశినేని నాని అనుచరుడు, తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు సతీసమేతంగా వైసీపీ కండువా కప్పుకొన్నారు. పార్టీలో చేరిన గంటల వ్యవధిలోనే ఆయనకు తిరువూరు సీటు ఖరారు చేసినట్టు సమాచారం. దీంతో ఇంతకాలం వేచి చూసే ధోరణి అవలంబించిన సిటింగ్ ఎమ్మెల్యే రక్షణనిధి వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఆయన పార్టీ వీడుతారన్న సమాచారంతో పార్టీ సమన్వయకర్తలు ఆయన్ను బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తాడేపల్లి పెద్దల బుజ్జగింపులు సైతం పని చేయలేదని సమాచారం. శుక్రవారం పార్టీకి గుడ్‌బై చెప్పి, త్వరలో ఆయన టీడీపీలో కానీ కాంగ్రెస్‌లో కానీ చేరుతారన్న ప్రచారం జరుగుతోంది.



జోగి రమేశ్



ఉప్పాల రాము

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పెడన సిటింగ్ ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేశ్‌కు పెనమలూరు స్థానాన్ని కేటాయించారు. ఈ స్థానం నుంచి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కొలుసు పార్థసారథి వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరనుండటంతో పెనమలూరును జోగికి కేటాయించారు. జోగి రమేశ్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఆయనతో మాట్లాడిన వైసీపీ పెద్దలు పెనమలూరు టికెట్ ఖాయం చేసినట్టు సమాచారం. అయితే టీడీపీ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీకి జోగి వెనుకాడుతున్నట్టు సమాచారం. జోగి పెనమలూరు మారుతుండటంతో పెడన నుంచి వైసీపీ అభ్యర్థిగా ఉప్పాల రాముని ఖరారు చేశారు. వాస్తవానికి ఉప్పాల రాముకి టికెట్ దక్కకుండా జోగి విశ్వప్రయత్నాలు చేశారు. పెడన టికెట్‌ను జనసేన నుంచి పార్టీలోకి చేర్చుకున్న యడ్లపల్లి రామ్ సుధీర్‌కు ఇప్పించేందుకు చివరి క్షణం వరకు ప్రయత్నించారు. కానీ ఆయన ప్రయత్నాలకు వైసీపీ అధిష్ఠానం చెక్ పెట్టింది. తాజా జాబితాతో కృష్ణా జిల్లాలో వైసీపీ అభ్యర్థులు దాదాపు ఖరారైనట్టు అయింది. ఒక్క అవనిగడ్డ స్థానంపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడ సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రికి అవకాశం ఇవ్వకపోవచ్చని ఆయన స్థానంలో మరొకరికి అవకాశం ఇస్తారన్న ప్రచారం ఉంది. మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన ఉప్పాల రాము, గుడివాడ కొడాలి నాని, గన్నవరం వల్లభనేని వంశీ, పామర్రు కైలే అనిల్ కుమార్, పెనమలూరు నుంచి జోగి రమేశ్ వైసీపీ తరఫున బరిలో నిలవనున్నారు.

పార్టీలో చేరకుండానే నానికి ఎంపీ సీటు

విజయవాడ ఎంపీ కేశినేని నాని ఇంకా వైసీపీలో అధికారంగా చేరలేదు. కానీ గురువారం విడుదలైన జాబితాలో ఆయన పేరును విజయవాడ ఎంపీ స్థానానికి ఖరారు చేశారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కోసం తాడేపల్లి పెద్దలు చాలా టెన్షన్ పడ్డారు. చివరి నిమిషంలో నాని వైసీపీ పంచన చేరడంతో ఆగమేఘాలపై ఆయనకు టికెట్ ఖరారు చేశారు.

నేడు చంద్రబాబును కలవనున్న సారథి

పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కె.పార్థసారథి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలవనున్నారని సమాచారం. సారథిని నూజివీడు నుంచి బరిలోకి దించాలని టీడీపీ అధినేత భావిస్తున్నారు. పెనమలూరు నుంచి జోగి రమేశ్ రంగంలో ఉన్న నేపథ్యంలో టీడీపీ కూడా బీసీని బరిలోకి దించాలని భావిస్తే సారథికి పెనమలూరు దక్కే అవకాశం ఉంది. సారథి కూడా పెనమలూరు నుంచే పోటీకి సుముఖత చూపుతున్నారు.



ప్రధాన బరి ఏర్పాట్లు

బరి తెగిస్తున్నారు!

- అంపాపురంలో 50 ఎకరాల్లో బరులు, వాహనాలకు పార్కింగ్
- పందెం రాయుళ్లకు సాంకేతికతతో కూడిన ప్రత్యేక సౌకర్యాలు
- చీకోటి ప్రవీణ్ సూచనలతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- ఎన్నికల ఏడాది కావడంతో భారీగా కోడిపందేలు, జూదాలు

- 6లో..

చోరీ సొత్తు స్వాధీనం

- నిందితుడి అరెస్టు

- 6లో..



విజయవాడ రైల్వే డివిజన్ ఉద్యోగుల నిరసన దీక్ష

కొత్త పెన్షన్ స్కీమ్ మాకొద్దు

- ఓపీఎస్ కోసం నినదించిన రైల్వే ఉద్యోగులు
- డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సామాజిక భద్రత లేని నూతన పెన్షన్ విధానం వద్దని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) విజయవాడ డివిజన్ ప్రధాన కార్యదర్శి లీల అన్నారు. ఉద్యోగులకు భద్రత లేని ఈ విధానాన్ని రైల్వే కార్మికులు ముక్తకంఠంతో తిప్పికొట్టాలన్నారు. గురువారం ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్), దక్షిణ మధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ)లు సంయుక్త పిలుపు మేరకు విజయవాడ డివిజన్ వ్యాప్తంగా ఎన్‌పీఎస్ రద్దు-ఓపీఎస్ సాధన కోసం నిరాహార దీక్షలు నిర్వహించారు. డివిజినల్ పరిధిలోని అన్ని స్టేషన్లు, యూనిట్లు, డిపోలు, ఇంజనీరింగ్ విభాగాల వద్ద రైల్వే కార్మికులు నిరాహార దీక్షలు చేశారు. విజయవాడ డీఆర్ఎం కార్యాలయం ఎదుట జరిగిన నిరాహార దీక్ష కార్యక్రమంలో లీల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాత పెన్షన్ విధానంలో నలభై సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవీవిరమణ చేస్తే చివరి రోజు వచ్చే జీతంలో సగం భాగం మాత్రమే పెన్షన్ వస్తుందని, నూతన పెన్షన్ విధానంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు రెండువేల నుంచి ఐదు వేల రూపాయలు మాత్రమే పెన్షన్ ఇవ్వడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో పాత పెన్షన్ కొనసాగిస్తామని చెప్పిన వారినే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ అధ్యక్షులు రామగుప్త మాట్లాడుతూ, నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులకు చివరికి మిగిలేది ఏమీ ఉండదని, ఆవేదన చెందారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచటం కోసమే తాము ఆందోళనలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో సమ్మెకు కూడా వెళ్లే పరిస్థితులు ఉన్నందున కార్మికులంతా కలిసికట్టుగా రావాలన్నారు. ఆందోళనలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు వి.ఉమామహేశ్వరరావు పాల్గొని మద్దతు పలికారు. కార్యక్రమంలో లక్ష్మి, శేఖర్‌బాబు, ప్రసాద్, సుధీర్, భానుబాబు, అహ్మద్ షరీఫ్, శ్రీనివాసరావు, హారిక, అప్పలనాయుడు, షౌకత్ అలీ, వెంకటేశ్వరరావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కృష్ణా కలెక్టర్ రాజాబాబు

రూ.14.50కోట్లు జగనన్నతోడు రుణాల పంపిణీ

- కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జగనన్నతోడు పథకం చిరువ్యాపారులకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. 8వ విడత జగనన్నతోడు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలునుంచి వర్చువల్‌గా కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 8వ విడత 13710మంది లబ్ధిదారులకు రూ.14.50కోట్ల రుణాలు అందజేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 59వేలమంది లబ్ధిదారులకు రూ.130కోట్లను అందించినట్టు తెలిపారు. 27913మంది లబ్ధిదారులకు రూ.67.94లక్షలను వడ్డీగా జమచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో బందరు ఎమ్మెల్యే పేర్నినాని, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, ముడా చైర్‌పర్సన్ బొర్రా వెంకటనాగలక్ష్మి, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జగనన్న తోడు, వడ్డీ జమ చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు అందజేశారు.

అరాచక పాలన నుంచి విముక్తి కావాలి

- దేవినేని ఉమా



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఉమా

గొల్లపూడి, జనవరి 11 : జగన్ అరాచకపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం రాయనపాడులో ఆయన ధాన్యం రాశులను రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ, సీఎం అసమర్థ, చేతగానితనం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పట్టిసీమ దండగ అని పంపులు పీకాలన్న దుర్మార్గమైన ఆలోచనతో నాలుగేళ్ల పంటలు లేకుండా పోయాయన్నారు. జూలై నెలలో పట్టిసీమ పంపులు మొత్తం వదిలి ఉంటే నవంబరులోపే పంటలు చేతికి వచ్చేవని.. రైతుల పంటలు తుఫాన్ బారిన పడేవి కావన్నారు. ఎన్నికల్లో ఓటు ఆయుధంతో జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను తిట్టే వారికి వైసీపీ టికెట్లు ఇస్తుందన్నారు. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో శీలంనేని సాంబశివరావు, పోలసాని సుబ్బారావు, జాస్తి రామకృష్ణ, కాటమనేని శివ ప్రసాద్, మురళీ, మల్లెల శ్యాం కుమార్ బొర్రా నాగేశ్వరరావు, చప్పిడి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు మొండిచేయి

- కొనకళ్ల నారాయణ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జనవరి 11 : నాలుగున్నరేళ్లుగా జగన్మోహన్‌రెడ్డి కల్లబొల్లి మాటలతో బీసీలకు తీరని అన్యాయం చేశారని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ ధ్వజమెత్తారు. మచిలీపట్నంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల అభివృద్ధికి జగన్‌రెడ్డి చేసింది శూన్యమన్నారు. కర్నూలు ఎంపీ సంజయ్ వ్యాఖ్యలు జగన్‌రెడ్డి నియంతృత్వ ధోరణికు ఉదాహరణ అన్నారు. కేశినేని నాని టీడీపీలో రెండు పర్యాయాలు ఎంపీగా పదవులు అనుభవించి పార్టీ నాయకులపై బురద జల్లడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సూర్యబలిజ సాధికార రాష్ట్ర కన్వీనర్ చిత్తజల్లు నాగరాము మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్ల 16 వేలమందికి పదవులు దక్కలేదన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న వెనిగండ్ల, రావి, కొనకళ్ల, వర్ల తదితరులు

గుడివాడలో చంద్రబాబు సభకు స్థల పరిశీలన

గుడివాడ రూరల్ : చంద్రబాబు నాయుడు 'రా కదలిరా' కార్యక్రమానికి టీడీపీ నాయకులు గురువారం స్థల పరిశీలన చేశారు. అలంకృత ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న స్థలాన్ని సెంట్రల్ కమిటీ పరిశీలించింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సత్యనారాయణ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, రావి వెంకటేశ్వరరావు, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

తాడోపేడో..

- పోర్లు దండాలు, సాష్టాంగ నమస్కారాలు, మానవహారం
- వేడి పెంచుతున్న నిరసనలు
- 31వ రోజుకు అంగన్వాడీల సమ్మె





జగ్గయ్యపేటలో అంగన్వాడీ కార్యకర్తల మానవహారం

మచిలీపట్నం టౌన్/జగ్గయ్యపేట జనవరి 11 : కనీస వేతనాలు చెల్లించాలంటూ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించి నోటీసులు జారీచేసినా భయపడేది లేదంటూ సమ్మెను కొనసాగించారు. కార్యకర్తలు పలురీతిలో నిరసన దీక్షలు, ధర్నాలు, జైల్‌భరోలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సంఘ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, ప్రాజెక్టు నాయకురాలు రజనీరాణి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన దీక్షల్లో వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు. ఉద్యమానికి సీఐటీయూ, పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. 31 రోజులకు గాను శిబిరంలో పూలదండలతో నిరసన వ్యక్తం చేశారు. 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.



మచిలీపట్నంలో..

- జగ్గయ్యపేటలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసనల జోరు పెంచారు. 31వ రోజు కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. కార్యకర్తలు పోర్లుదండాలు పెడుతూ, సాష్టాంగ నమస్కారాలు చేశారు. రాష్ట్రమంతా స్పందిస్తున్నా సీఎం జగన్‌కు మాత్రం చీమ కుట్టినట్టు లేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్మా చట్టాలు ఎన్ని తెచ్చినా ఆందోళన విరమించేది లేదని, డిమాండ్ల సాధనకు ఎంత దూరమైనా వెళతామని హెచ్చరించారు.

సీఎం జగన్ మౌనం వీడాలి

- సమస్యలు పరిష్కరించకుంటే తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తాం

కంకిపాడు : అంగన్వాడీల నిరవధిక సమ్మెను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోకుండా బాధ్యతా రహిత్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ అనుబంధ సంఘం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. కంకిపాడులో అంగన్వాడీల సమ్మెకు గురువారం ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.10 లక్షల మంది సమ్మెలో పాల్గొంటే సంబంధిత శాఖ మంత్రి నిద్ర పోతున్నారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అంగన్వాడీలకు రూ. 4 వేల నుంచి రూ. 10500కు జీతాలను పెంచిందని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం పెంచింది కేవలం రూ. 1 వెయ్యి మాత్రమే అన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగల కొడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. అవసరమైతే తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామన్నారు. అంగన్వాడీల సమ్మెకు టీడీపీ పూర్తిగా మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తాడిగడప మున్సిపాలిటి అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, టీడీపీ మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, నియోజకవర్గ అధ్యక్షురాలు అన్నవరపు శివపార్వతి స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బరి తెగిస్తున్నారు!

- అంపాపురంలో 50 ఎకరాల్లో బరులు, వాహనాలకు పార్కింగ్
- పందెం రాయుళ్లకు సాంకేతికతతో కూడిన ప్రత్యేక సౌకర్యాలు
- చీకోటి ప్రవీణ్ సూచనలతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- ఎన్నికల ఏడాది కావడంతో భారీగా కోడి పందేలు, జూదాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 11 : తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగైన సంక్రాంతికి అంతే భారీగా కోడిపందేల నిర్వహణ కోసం బరులు సిద్ధం చేస్తున్నారు. తెలుగురాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిసా తదితర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి పందేలలో పాల్గొనే అతిపెద్ద బరిగా పేరుగాంచిన అంపాపురంలో నిర్వాహకులు ఈసారి ఎక్కడా తగ్గకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీఏటా మూడు రోజుల పాటు జరిగే కోడిపందేలు ఈసారి మరింత ఎక్కువగా జరిగే విధంగా సాంకేతికతో కూడిన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కోతముక్క, అందర్ బాహర్, తీన్‌పత్తీ లాంటి వాటి కోసం భారీ యంత్రాల సాయంతో ప్రత్యేకంగా గదులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం. పండుగ ఇంకా మూడు రోజులే ఉండటంతో ఇప్పటికే 50 ఎకరాలకు పైగా భూమిని చదును చేసి బరుల ఏర్పాటు ముమ్మరం చేస్తున్నారు. 20 ఎకరాల్లో బరులు, మిగిలిన భూమిని కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉండేలా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మరో పక్క కె.సీతారాంపురంలో మరో పెద్ద బరి వైసీపీ రాష్ట్ర స్థాయి నేత అండదండలతో భారీగా తయారవుతోంది. ఆదాయం కోట్లలో ఉండటంతో మరికొంతమంది నాయకులు గ్రామాల్లో బరులను కూడా ప్రోత్సహిస్తున్నారు. బాపులపాడు మండలంలోనే ఈసారి కోట్లలో పందేలు జరుగుతాయని పందెపురాయుళ్లు ఉవ్విళ్లూరుతున్నారు.

● సాంకేతికత సొబగులు

అంతర్జాతీయ స్థాయిలో చేయితిరిగిన చీకోటి ప్రవీణ్ సూచనలతో అంపాపురం బరికి సాంకేతిక సొబగులు అద్దుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహణకు, వీడియోల ద్వారా కోడిపందేలు తిలకిస్తూ పందెం కాసేందుకు కావలసిన ఏర్పాటు, నెట్‌వర్క్‌లతో ఇబ్బంది లేకుండా వైఫై సదుపాయం కూడా ఏర్పాటు చేస్తున్నారు. 24 గంటలూ అన్ని రకాల జూదాల నిర్వహణకు భారీ ఫ్లడ్ లైట్లు, పెద్ద పెద్ద టెంట్లతో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన బరిలో జరిగే లక్షల్లో పందేలను చూసేందుకు ప్రేక్షకులకు, పందెపురాయుళ్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా భారీతెరలు, కూర్చునేందుకు సోఫాలు, ఏసీలు వంటి సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. పేకాట కోసమైతే ప్రత్యేక శిబిరం, పాల్గొన్న వారికి కూర్చున్నచోటే సకల సౌకర్యాలు(మందు, విందు) అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



అంపాపురంలో సిద్ధం చేస్తున్న ప్రధాన బరి

● కట్టుదిట్టమైన ఏర్పాట్లు

గత ఏడాది పోలీసుల దాడిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు. ఈసారి బరులు మొత్తం సీసీ కెమెరాలతో పాటు బౌన్సర్లను కూడా భారీగా సిద్ధం చేస్తూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పందెపురాయుళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీ మద్యం కూడా అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్టు నిర్వాహకుల్లో ఒకరు తెలిపారు. అనుమతితో తప్ప అన్యులెవరూ రాకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లతో పాటు ఆవరణ మొత్తం తమ కనుసన్నల్లో ఉండేలా సీసీ కెమెరాలు, వాకీటాకీలతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో కోడిపందేల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రావనే ధీమాతో భారీస్థాయి నిర్వహణకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి బాపులపాడు మండలంలోని రెండు ప్రధాన బరులతో పాటు, గ్రామల్లో నిర్వహించే చిన్నపాటి బరుల్లో కోట్లాది రూపాయల జూదం జరుగుతుందని పందెపురాయుళ్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నాని వెంట నడిచేది లేదు

- తేల్చి చెప్పిన నందిగామ టీడీపీ శ్రేణులు

నందిగామ, జనవరి 11 : అరవై శాతం కాదు కదా అరశాతం కూడా నందిగామ నుంచి ఎంపీ కేశినేని నాని వెంట నడిచే పరిస్థితి కనపడటం లేదు. కేశినేని తెలుగుదేశం పార్టీలో ఉండగా నందిగామ నుంచి పలువురు నాయకులు ఆయనతో సన్నిహితంగా ఉండే వారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అరవై శాతం టీడీపీని ఖాళీ చేస్తానని అహంభావంతో ఆయన వ్యాఖ్యానించారు. నందిగామ టీడీపీ నుంచి ఆయన వెంట అరశాతం కూడా కదిలే పరిస్థితి కనిపించడడం లేదు. ఎన్టీఆర్ హయాంలో రాష్ట్రంలో చక్రం తిప్పిన వసంత నాగేశ్వరరావు వంటి నేతలు పార్టీ మారిన సమయంలో ఒక్కరు కూడా ఆయన్ను అనుకరించి పార్టీ మారలేదు. కేశినేని పలుమార్లు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు, వ్యతిరేక ప్రటనలు చేసిన సమయంలో టీడీపీ కేడర్ భరిస్తూ వచ్చింది. ఏకంగా వైరి పక్ష ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఆకాశానికి ఎత్తుతూ, స్వపక్ష నేతలను కించపరిచే వ్యాఖ్యలు నాని చేశారు. ఏడు నియోజకవర్గాల్లో ఆయనకు కొంత అనుచరగణం ఉంది. నిత్యం కలుస్తూ విధేయత చాటుకొనే నేతలున్నారు. ఇటీవల నందిగామలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేశినేనికి ఆయన అనుచరులు భారీ స్వాగతం పలికారు. పూలపై నడిపించారు. అదంతా తన సొంత బలంగా భావించిన ఆయన నందిగామ ఇన్‌చార్జిని కూడా మార్చాలన్న అభిప్రాయాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. కొందరు ఆశావహులను చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. కేశినేని ప్రయత్నాలను తోసిపుచ్చిన చంద్రబాబు ఇన్‌చార్జిగా సౌమ్య అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ క్రమంలో కేశినేని జగన్‌ను కలవడం, ఆపై చంద్రబాబును తక్కువగా మాట్లాడటంతో ఒక్కసారిగా చిత్రం మారిపోయింది. ఆయన వెంట వెళ్లడం మాట అటుంచితే కనీసం ఆయన మొఖం చూడడానికి కూడా పార్టీ శ్రేణులు ఇష్ట పడటం లేదు. చంద్రబాబును దూషించడంతో పాటు అమరావతికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి. ఆయనతో పాటు పార్టీ మారే ప్రసక్తి లేదని పలువురు స్పష్టం చేస్తున్నారు. ఎంపీ వెళ్లిపోవడంతో పార్టీ మొత్తం ఏకతాటిపైకి వచ్చినట్టు చెబుతున్నారు.



నారా లోకేశ్‌తో ఎంఎస్ బేగ్, పశ్చిమ టీడీపీ శ్రేణులు

టీడీపీలోనే కొనసాగుతాం

- నారా లోకేశ్‌తో ఎంఎస్ బేగ్

వన్‌టౌన్ : తెలుగుదేశం పార్టీలోనే తాము కొనసాగుతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్ స్పష్టం చేశారు. గురువారం ఉండవల్లిలో నారా లోకేశ్‌ను ఎంఎస్ బేగ్, నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన లోకేశ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ, వైసీపీలోకి వెళ్లిన ఎంపీ కేశినేని నానితో తాము వెళ్లడం లేదని టీడీపీలోనే కొనసాగుతామని చెప్పారు.

తిరువూరు సాకు మాత్రమే..

- శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట : ఇష్టం లేకపోతే పార్టీని విడిచి వెళ్లాలే కాని, రెండుసార్లు ఎంపీని చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లపై వ్యాఖ్యలు చేయటం కేసినేని నానికి తగదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ కోశాధికారి శ్రీరాం తాతయ్య అన్నారు. తిరువూరు ఘటన ఒక సాకేనన్నారు. తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, విజయవాడ పార్లమెంట్ స్థానం సహా అన్ని స్థానాల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. చంద్రబాబు రా.. కదలిరా పిలుపు మేరకు అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని శ్రీరాం తాతయ్య అన్నారు. శనివారం పెనుగంచిప్రోలులో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తాతయ్య వివరించారు.

తిరుపతమ్మ రంగుల ఉత్సవం జయప్రదం చేయాలి : ఆర్డీవో

పెనుగంచిప్రోలు, జనవరి 11 : ఫిబ్రవరిలో జరగనున్న తిరుపమ్మ రంగుల ఉత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో సాయిబాబు అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఈవో కె.రమేశ్ నాయుడు అధ్యక్షతన గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఫిబ్రవరి 1న అమ్మవారు సహదేవతలు దేవస్థానం నుంచి పడమర బజారున ఉన్న రంగుల మండపం వద్దకు చేరుకొని అక్కడి నుంచి అదేరోజు రాత్రి 11 ఎద్దుల బండ్లపై బయలుదేరి ఫిబ్రవరి 2న ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేటలోని రంగుల మండపం వద్దకు చేరుకుంటాయని ఈవో తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 18న జగ్గయ్యపేటలో పల్లకీలో బయలుదేరి వయా చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం గ్రామాల మీదుగా 20న సాయంత్రానికి పెనుగంచిప్రోలుకు చేరుకుంటాయని తెలిపారు. ఆర్డీవో సాయిబాబు మాట్లాడుతూ, రంగుల ఉత్సవం సందర్భంగా ప్రధానంగా పారిశుధ్యంపై గ్రామ పంచాయతీతో పాటు పలుశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఏసీపీ కె.జనార్ధన నాయుడు మాట్లాడుతూ, ఉత్సవానికి భారీ బందోబస్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.లక్ష్మికల్యాణి, ఎంపీడీవో పి.హర్షాసాయి, ధర్మకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఉపాధి పనుల కల్పనలో కృష్ణాకు రెండోస్థానం : కలెక్టర్ రాజాబాబు



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జేసీ

మచిలీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరు నుంచి అధికారులతో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా 68లక్షల పనిదినాలను కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 66లక్షల పనిదినాలను కల్పించి రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 252 సచివాలయ భవనాలకు గాను ఇప్పటివరకు 203 భవనాల నిర్మాణం పూర్తి చేసినట్టు తెలిపారు. 172 ఆర్‌బీకేల భవన నిర్మాణాలు ప్రారంభించి 122 నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మూడోదశ భూమి రీ సర్వే 106గ్రామాలలో ప్రారంభించి 90 గ్రామాలలో తుది ఆర్వోఆర్ పూర్తిచేయడం జరిగిందన్నారు. సమావేశంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో పి.రోజా, డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై జెడ్పీ కన్వెన్షన్‌హాలులో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జేసీ గీతాంజలి శర్మ గురువారం పరిశీలించారు. ఈ నెల19న విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా రూపొందించిన కార్యక్రమాలను జిల్లాలో సక్రమంగా అమలు చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ

చోరీ సొత్తు స్వాధీనం

- నిందితుడి అరెస్టు

మచిలీపట్నం టౌన్, జనవరి 11 : ఇనకుదురు స్టేషన్ పరిధిలో పట్టపగలు ధాన్యం వ్యాపారి ఇంట్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలు, నగదును పోలీసులు రికవరీ చేశారు. నిందితుడు ఉప్పాల శివసాయిరామ్‌ను అరెస్టు చేశారు. మచిలీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ యు.నాగరాజు



గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధాన్యం వ్యాపారి పద్మనాభుని చిననాగేశ్వరరావు ఈనెల 25న ఆసుపత్రి పని నిమిత్తం విజయవాడ వెళ్లి రాత్రి వచ్చేసరికి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. బీరువా బద్దలకొట్టి ఉండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇనకుదురు సీఐ ఎ.ఉమామహేశ్వరరావు, ఎస్ఐలు సత్యనారాయణ, కిషోర్‌లు కేసు విచారణ చేపట్టి నిందితుడు ఉప్పాల శివసాయిరామ్ నుంచి రూ.23.50లక్షల విలువైన 429 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు, రూ.3.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 26.69లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తన ఇంటి వెనుక గుంతలో ఆభరణాలు దాచినట్టు తేలిందన్నారు. కేసు ఛేదించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

వాహన తనిఖీలు.. 15 కేజీల వెండి స్వాధీనం

బంటుమిల్లి : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో పోలీసులు గురువారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో ఎస్సై పైడిబాబు సిబ్బంది నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రెండు మద్యం బాటిళ్లు, విజయవాడకు చెందిన వ్యాపారి నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా సుమారు 15 కేజీల వెండి వస్తువులను స్వాధీనపరచుకుని కేసు నమోదు చేశారు. అలాగే అమలాపురానికి చెందిన వ్యక్తి నుంచి రూ.3.84 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

గన్నవరం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,77,132

గన్నవరం, జనవరి 11: ఓటర్ల జాబితా సవరణ చేశాక గన్నవరం నియోజకవర్గంలో 2,77,132 మంది ఓటర్లు ఉన్నారని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ గోపాలరెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో గోపాలరెడ్డి అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అక్టోబరులో ప్రచురించిన తుది జాబితాకు అదనంగా 12,976 మంది ఓటర్లుగా నమోదయ్యారని, ఇంకా 3,560 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని గోపాలరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా చేర్పుల కోసం ఫాం-6 దరఖాస్తులు 23,818 రాగా, 19025 ఆమోదం పొందాయని, తొలగింపులకు ఫాం-7 దరఖాస్తులు 10,046 రాగా 9,403 దరఖాస్తులు ఆమోదించామని తెలిపారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కో- ఆర్డినేటర్ ఆళ్ల గోపాల కృష్ణ, నాదిండ్ల మోహన్, కళ్లం వెంకటేశ్వరరావు బొబ్బవరపు శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం

టీడీపీకి మద్దతు పలకండి

ప్రజలకు టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పిలుపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 11: "పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించగలిగే సత్తా టీడీపీకే ఉంది. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడంలేదు. యువత భవిష్యత్‌ను వైసీపీ పాలకులు అంధకారంలోకి నెట్టారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ, ప్రైవేటు, స్వయం ఉపాధి రంగాల్లో 20లక్షల ఉద్యోగాలు సృష్టించాని టీడీపీ లక్ష్యంగా పెట్టుకుంది. యువత భవిష్యత్తుతో పాటు రాష్ట్రాభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలకండి.' అని ప్రజలకు టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్ చార్జి యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. టీడీపీ రేమల్లె గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ కూడ లిలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు అండగా నిలుస్తూ సేవలందించేందుకే రాజకీయాల్లో కొనసా గుతున్నానని, అక్రమార్జన కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు ప్రశార్థకంగా మార్చిన ఘనత వైసీపీ పాలకులదేనన్నారు. రాష్ట్రంలోనే నిరుద్యోగ పట్టభద్రులు 36 శాతం ఉన్నట్లు సీఎంఐ సర్వేలో తేలిందన్నారు. యనమదల శ్రీనివాసరావు, గుడివాడ విజయానంద్, యనమదల సుధాకర్, కలపాల కుమార్, దొంతు చిన్నా, వేములపల్లి శ్రీనివాసరావు, యనమదల వెంకయ్యారావు, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయి కల్యాణి, గుండపనేని ఉమావరప్రసాద్, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, కలపాల సూర్యనారాయణ, తాటిపాముల నాగయ్య, లింగవరపు లోకేష్, వంశీ, తుమ్మల ఉదయ్, కలపాల రాధాకృష్ణ పాల్గొన్నారు.



రేమల్లెలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు



నాగవరప్పాడులో కరపత్రాలను పంచుతున్న ఆరుమళ్ల కృష్ణారెడ్డి

రైతులను దగా చేసిన ప్రభుత్వమిది

ఉంగుటూరు: రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ మద్దతు ధరను స్వల్పంగా పెంచి రైతులను నిలువునా దగా చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం నాగవరప్పాడు, మధిరపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ -భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ హయాంలో రైతులకందించిన డ్రిప్పులు, వ్యవసాయ పరికరాల సబ్సిడీలను వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిందని తెలిపారు. రైతుల గోడు పట్టని జగన్ పాలనకు చరమగీతం పాడి, టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామ పార్టీ నాయకులు మావులూరి వెంకయ్య, తుమ్మల రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ మునిగిపోయే నావ: బోడె ప్రసాద్

పెనమలూరు: వైసీపీ మునిగిపోయే నావ అని ఆ పార్టీలో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరని, దీంతో ఆపార్టీ పెద్దలు అల్లాడుతున్నారని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ ఎద్దేవా చేశారు. తాడిగడపలో గురువారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. నేతలు ధనకోటేశ్వరరావు, బోడె వెంకట్‌రామ్, సెంగెపు రంగారావు, చిగురుపాటి మాలయ్య, అనుమోలు ప్రభాకర్, తోటకూర ఉదయ్‌భాస్కర్, షేక్ సైదులు, షేక్ సలీం, బొమ్మిడి నాగరాజు, వనమల ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ - జనసేన ఆత్మీయ సమావేశం

టీడీపీ పెనమలూరు నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు టీడీపీ-జనసేన పార్టీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు బోడె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఇరుపార్టీలు అనుసరించాల్సిన వ్యూహం, ప్రణాళికపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



తాడిగడపలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న బోడె ప్రసాద్ తదితరులు



అంగన్వాడీలకు రూ.10 వేలు అందజేస్తున్న టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకర్, దేవినేని రాజా తదితరులు

అంగన్వాడీలకు అండగా టీడీపీ

కంకిపాడు, జనవరి 11: చాలీచాలని వేతనాలతో, అర్ధాకలితో అల్లాడుతున్న అంగన్వాడీలు 31 రోజులుగా సమ్మె చేస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని అంగన్వాడీలకు తమ పార్టీ అండగా ఉంటుందని టీడీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర్ అన్నారు. కంకిపాడులో అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు గురువారం మాజీ ఎంపీపీ దేవినేని రాజాతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. రూ.10 వేలను అందించారు. సుదిమళ్ల రవీంద్ర, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, కోడెల సురేష్ పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

సమసమాజ స్థాపనకు స్వామి వివేకానంద కృషి

హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 11: సమసమాజ స్థాపనకు స్వామి వివేకానంద అవిరళ కృషి చేశారని భారతీయ సంస్కృతిని, దేశభక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని గన్నవరం ఖండ కార్యవాహక్ ఎదురువాడ శ్రీనివాసరావు అన్నారు. కానుమోలులో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా వివేకానంద చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అయోధ్య శ్రీరాముని అక్షితలను ప్రజలకు పంపిణీ చేశారు. సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ తట్టి వెంకట సుబ్బారావు, నూకల పాండు, చెన్నుబోయిన రంగారావు, గన్నవరం సబ్ డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకులు

నీరు నింపకపోవడంతో గృహనిర్మాణదారులకు ఇక్కట్లు

ఉయ్యూరు, జనవరి 11: ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి నాగన్నగూడెం సమీపాన జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు నీరులేక గృహనిర్మాణదారులు ఇబ్బంది పడుతున్నారు. నగరపంచాయతీ పరిధిలో ఇళ్లులేని పేదలకు పట్టణానికి దూరంగా నాగన్నగూడెం సమీపాన మాగాణి భూమిని సేకరించి 2వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. ఇళ్ల నిర్మాణానికి నగరపంచాయతీ అరకొర వసతులు కల్పించి, ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఇళ్ల నిర్మించుకునేందుకు నీటి బోరు వేసి నీరు నిల్వ ఉంచేందుకు రోడ్లపక్కన ప్లాస్టిక్ నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. కొన్నిరోజులుగా సిబ్బంది ట్యాంకులను నీటితో నింపడం లేదు. దీంతో నిర్మాణానికి, గోడలు, పిల్లర్లు తడుపుకొనేందుకు నీరులేక నిర్మాణదారులు ఇబ్బంది పడుతున్నారు. నీరు లేక నిర్మాణం మధ్యలో నిలిపివేయలేక కొందరు అప్పులుచేసి చేతి పంపులు వేసుకుని నానా తంటాలు పడతున్నారు. అలంకారప్రాయంగా ఉన్న ట్యాంకుల్లో నీరు లేక ఇంటి నిర్మాణం చేసేదెలా అని ఆందోళన చెందుతున్నారు. అంతర్గత రోడ్లు లేక నిర్మాణ సామగ్రి చేరవేసుకునేందుకు వాహనాలు రాక నిర్మాణదారులు అవస్థలు పడుతున్నారు.



నాగన్నగూడెం జగనన్న కాలనీలో నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ ట్యాంకులు

ట్యాంకుల్లో నీటిని నింపుతాం

నాగన్నగూడెం జగనన్న కాలనీలోని ట్యాంకుల్లో నీరు నింపుతాం. ఇళ్లు కట్టుకునే వారికి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– పి.వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్

అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి

కిందపడి వివాహిత మృతి

విద్యాధరపురం, జనవరి 11: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వివాహిత అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి కిందపడి మృతి చెందిన ఘటన గురువారం భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో నరసింహ ఎన్‌క్లేవ్‌లో డొగిపర్తి మురళీకృష్ణ కుటుంబంతో ఉంటున్నాడు. భార్య చైతన్యలక్ష్మి అనారోగ్యంతో, మానసిక సమస్యతో బాధపడుతోంది. బుధవారం మురళీకృష్ణ వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లి గురువారం తెల్లవారుజామున 4.30 కు ఇంటికి వచ్చి భార్యను పలకరించి నిద్రపోయాడు. ఉదయం 6.30 సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ వచ్చి మీ భార్య కారు పార్కింగ్ ఎదురుగా గాయాలతో పడి ఉందని చెప్పాడు. తల్లితో వెళ్లి చూసి ఆయన అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. వారు వచ్చి చూసి మృతి చెందినట్లు చెప్పారు. మనస్తాపంతో ఇలా చేసుకొని ఉంటుందని మురళీకృష్ణ ఫిర్యాదు చేశాడు.

చోరీ కేసులో

నిందితుడి అరెస్టు

విద్యాధరపురం, జనవరి 11: చోరీ కేసు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి రూ.2లక్షల 15వేలు, 4 ద్విచక్రవాహనాలను భవానీపురం పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బైక్ దొంగతనాలపై పోలీసులకు పలు ఫిర్యాదులు వచ్చాయి. భవానీపురం సీఐ కృష్ణ సిబ్బందితో బుధవారం రామరాజ్యనగర్ కట్ట వద్ద చెట్ల పొదల్లో అనుమానితున్ని అదుపులోకి తీసుకొని విచారణజరిపి, రామరాజ్యనగర్ చెందిన షేక్ బాషా(29)ను నిందితుడిగా గుర్తించారు. బాషాను రిమాండ్‌కు పంపారు.

పట్టపగలే చోరీ

పాయకాపురం, జనవరి 11: పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన వాంబేకాలనీలో గురువారం జరిగింది. డీ బ్లాక్‌లో కాలేపు రాజు కుటుంబంతో ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్యాభర్తలు రోజువారీ పనుల నిమిత్తం వెళ్లారు. సాయంత్రం వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరు వాలో ఉండాల్సిన 7 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40 వేలు కని పించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధా రణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	95, 103, 114
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఎన్నారై టీడీపీ ఆర్థిక సాయం



గుడివాడ : ఇటీవల అనారోగ్యంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త మెండెంపూడి కిరణ్ కుటుంబానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఎన్నారై టీడీపీ తరపున రూ.9.38 లక్షల చెక్కును అందజేశారు. అమ్మ అపార్టుమెంట్‌లోని కిరణ్ కుటుంబసభ్యులను వెనిగండ్ల, ఎన్‌ఆర్‌ఐ అడుసుమిలి కృష్ణ ప్రియ, గుత్తా గంగాధర్ కలిసి పరామర్శించారు. కిరణ్ కుమార్తె విద్యాభ్యాసానికి తమ వంతు సహాయం అందజేస్తామన్నారు. లింగం ప్రసాద్, కొల్ల సుధాకర్, ఏసుపాదం పాల్గొన్నారు.



అవనిగడ్డలో కరపత్రాలు అందజేస్తున్న మండలి వెంకట్రామ్



నాలిలో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు



వీరమాచినేనిపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న చిన్నా



పామర్రులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కుమార్‌రాజా

ప్రజాస్వామ్యానికి కీడు చేస్తున్న జగన్‌రెడ్డిని తరిమికొట్టాలి

బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో వెంకట్రామ్, వర్ల పిలుపు

అవనిగడ్డ, జనవరి 11 : ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్న జగన్ రెడ్డిని తరిమేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అవనిగడ్డ రెండో వార్డులో టీడీపీ మినీ మేనిఫెస్టోను మండలి వెంకట్రామ్ అందజేశారు. వెంకట్రామ్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజల హక్కులను హరిస్తున్న జగన్ రెడ్డిని సాగనంపేందుకు ప్రతి ఒక్కరూ టీడీపీ - జనసేనతో కలిసి నడవాలని వెంకట్రామ్ కోరారు. టీడీపీ నేతలు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, విశ్వనాథపల్లి పాప, బండే రాఘవ, బడే సుబ్బారావు, యలవర్తి చిన్నా, వాసు, బచ్చు రఘునాథ్, లుక్కా శ్రీను, బర్మా శ్రీను, మెగావత్ గోపి, పులిగడ్డ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుంటే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని తెలుగు రైతు నేత బావిరెడ్డి వెంకటేశ్వరరావు అన్నారు. నాలి గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, కొప్పనాతి వెంకటేశ్వరరావు, శంకరయ్య, నాగులుపాటి శ్రీనివాసరావు, విశ్వనాథపల్లి రాంబాబు, పెదశింగు నాగేంద్రబాబు, కొప్పనాతి కొండలు తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) అన్నారు. వీరమాచినేనిపాలెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి టీడీపీ - జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు అత్తులూరి గోపిచంద్, టీడీపీ నాయకులు ఆత్కూరి నాగరాజు, కొండవీటి శ్రీను, సాంబశివరావు, రాజేష్, అంజయ్య పాల్గొన్నారు. **పామర్రు :** రానున్న ఎన్నికల్లో ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్లకుమార్ రాజా అన్నారు. పామర్రు 15వ వార్డులో ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. దాలిపర్తి ప్రసాద్, పరిసే సుబ్రమణ్యం, వీరంకి వెంకటేశ్వరరావు, కేదరాశి పల్లి శ్రీనివాసరావు, అల్లంశెట్టి సురేష్ అంజిబాబు, సందీప్, చాట్ల చినరమేష్ పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన జగన్

పెడన : జగన్ పాలనలో వైసీపీకి చెందిన బీసీ నాయకులు బానిసలుగా మారిపోయారని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు అన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు జగన్ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. పెత్తనమంతా తన సామాజిక వర్గానికి అప్పగించిన జగన్‌కు నా బీసీలని చెప్పుకునే అర్హత లేదన్నారు. ప్రజాభిప్రాయం సరిగా లేదన్న సాకుతో బీసీలు, దళితులకు మాత్రమే టికెట్లు నిరాకరించడం అప్రజాస్వామికమన్నారు. బీసీలకు తగిన గౌరవం, గుర్తింపు, రాజ్యాధికారం ఇచ్చినది తెలుగుదేశం పార్టీయేనని వేణుగోపాలరావు గుర్తు చేశారు.



మొవ్వలో కబడ్డీ ఆడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



బంటుమిల్లిలో సంఘీభావం తెలుపుతున్న కాగిత



పామర్రులో 31 నమూనాలో వినూత్న నిరసన

అంగన్వాడీల వినూత్న నిరసన

కూచిపూడి : తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు దీక్షలు కొనసాగుతాయని అంగన్వాడీలు హెచ్చరించారు. మొవ్వలో కబడ్డీ ఆడి నిరసన వ్యక్తం చేశారు. మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాల ఆయాలు, సహాయకులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** న్యాయమైన డిమాండ్లు సాధించే వరకు పోరాటం ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. 31వ రోజు దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి ఆదిశేషు, దోనె సహదేవుడు, కొప్పనాతి తాతయ్య తదితరులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.నిర్మలాజ్యోతి, అవనిగడ్డ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు ఏ.నాగమణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సువర్ణ, కార్యదర్శి జి.సుశీల, ప్రాజెక్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాగిత, వైవీబీ సంఘీభావం

బంటుమిల్లి : బంటుమిల్లి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెకు టీడీపీ పెడన ఇన్‌చార్జ్ కాగితకృష్ణప్రసాద్, జనసేన ఇన్‌చార్జ్ పంచకర్ల రమేష్ సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది బస్టాండ్ సెంటర్‌లో ఒంటికాలిపై నిలబడి దండం పెడుతూ నిరసన తెలిపారు. గౌరిశెట్టి నాగేశ్వరరావు, మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్ అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం కార్మికుల హక్కులపై దాడి చేయడమేనని మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. అంగన్వాడీల 31వ రోజు శిబిరాన్ని కుమార్ రాజా, సనకా కిరణ్‌లతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలు నాలుగు రోడ్ల కూడలిలో 31 నమూనాలో కూర్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కైలే రత్నశ్రీ, బొమ్మారెడ్డి పద్మ, వాణి, సీఐటీయూ నేతలు ఒడుగు గంగాధర్, విల్సన్ పాల్గొన్నారు.

ఎస్సీ లే అవుట్ ఆక్రమణపై జనసేన నిరసన ర్యాలీ



మోపిదేవి : మోపిదేవిలోని లే అవుట్ -3 ఎస్సీ లే అవుట్‌లో ఆక్రమణలు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, ఆందోళన చేపట్టారు. లే అవుట్‌ను నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు స్వయంగా పరిశీలించారు. లే అవుట్ నుంచి జనసేన నేతలు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. తహసీల్దార్ కె.నవీన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్‌నియోజకవర్గ పార్టీ నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, చిలకలపూడి పాపారావు, రాయపూడి వేణుగోపాలరావు, మా దివాడ వెంకట కృష్ణ, గుడివాక శేషుబాబు, కేతరాజు శ్రీవల్లి, మెరకనపల్లి నరేష్, భోగిరెడ్డి సాంబయ్య, బాదర్ల లోలాక్షుడు, మర్రే గంగయ్య, విమల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీఎల్ క్రాంతిలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



వికాస్ రెయిన్‌బోలో ముగ్గుల పోటీలు



పెడనలో సంబరాలు ప్రారంభం



కూచిపూడిలో కబడ్డీ పోటీల ప్రారంభం

సంక్రాంతి సంబరాలు

అవనిగడ్డ : స్థానిక ఎస్.వి.ఎల్.క్రాంతి కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, పొట్టేళ్ల పోటీలు, కోడిపందాలు, విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలసి కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమహేశ్వరరావు భోగి మంటలు వేశారు. నృత్య ప్రదర్శనలు అలరించాయి. జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు ఎం.నాగేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్‌లు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్:** వేకనూరు సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా దీపాలంకరణ చేయటంతో ఆలయ సరికొత్త శోభను సంతరించుకుంది. నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

వికాస్ రెయిన్‌బో, గ్రంథాలయంలో..

గుడివాడ : సత్యనారాయణపురం వికాస్ రెయిన్‌బో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. రంగవల్లులు, భోగి మంటలతో సందడి చేశారు. చిన్నారుల సంప్రదాయ వస్త్రాధారణ అలరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రామచంద్రశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. షాగులాల్‌చంద్ ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో కొడాలి విజయభారతి స్మారకార్థం రంగవల్లుల పోటీలను గురువారం నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. తాడిపర్తి సునీత, కుమారి పూర్ణిమ, సంధ్య, గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, డీఆర్‌బి ప్రసాద్, కొడాలి రామ్మోహనరావు, గాదె మోహన్‌బాబు, బబిత, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పెడన : సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రహ్మపురంలోని దేవాంగ కల్యాణ మండపంలో సంక్రాంతి సంబరాలను చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ప్రారంభించారు. 60 మంది పాటల పోటీల్లో పాల్గొన్నారు. కాళీపట్నపు ఉమ, టి. విజయలక్ష్మి, అల్లాడ శ్యామలత పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండి ఉస్మాన్ బాషా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మట్టా రాధాకృష్ణమూర్తి, శంకర సాంబశివరావు, బాలాజీ, వెంకటేశ్వరమ్మ, బేగం, నూర్జహాన్, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పద్మావతి పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

కూచిపూడి : గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూచిపూడిలో అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాలకు చెందిన 13 జట్లు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫౌండేషన్ అధినేత గొట్టిపాటి సాయి, పామర్రు సీఐ వి.ప్రభాకర్, చిమ్మటా రాఘవేంద్రరావు, కొడాలి మురళీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నాగాయలంకలో రంగవల్లుల పోటీలు 14న

నాగాయలంక : సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీ భోగి నాడు శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్ ప్రాంగణంలో రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. పాల్గొన్న యువతులకు, మహిళలకు అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు జరిగే రంగవల్లుల పోటీలో ఉత్సాహంగా మహిళలు, యువతులు పాల్గొనాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల రక్తదానం



చల్లపల్లి : ఎస్సార్‌వైఎస్పీ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్, చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం సహకారంతో గురువారం రక్తదాన శిబిరం జరిగింది. చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ టిఎస్ఎస్.బాలజీ, సెక్రటరీ భవిరి శంకరనాథ్ శిబిరాన్ని పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, పూర్వవిద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు టి.సాంబశివరావు, అధ్యక్షుడు అశ్వినీ కుమార్, కార్యదర్శి బీడీఆర్.ప్రసాద్, ప్రతినిధులు ప్రసాద్‌బాబు, నాంచారయ్య, లీలాబ్రహ్మేంద్ర, జిలానీ, పెనుమూడి శ్రీనివాసరావు, నాంచారయ్య, వాసిరెడ్డి రాకేష్, చేతన్, పోతురాజు, మణికంఠ, సుభాషిణి, యర్రంశెట్టి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ తాండవకృష్ణ రక్తదానం చేశారు. డాక్టర్ కె.వి.శివప్రసాద్ 31 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

వెంకట్రామ్ పరామర్శ

కోడూరు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరజా వేణుగోపాల్ కుటుంబ సభ్యులను బడేవారిపాలెంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. పిట్టలంక గ్రామంలో ఇటీవల కాలంలో గుండెపోటుతో మృతి చెందిన బండే రమాదేవి కుటుంబసభ్యులను వెంకట్రామ్ పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు, బండే రాఘవ, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లికార్జునరావు, మాచవరపు ఆదినారాయణ, బడే నాగరాజు, బడే పిచ్చియ్య, గాదె భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆభరణాల తనిఖీ

అవనిగడ్డ : లక్ష్మీనారాయణ స్వామి, రాజశేఖర స్వామి, లంకమ్మ ఆలయాలకు చెందిన వెండి, బంగారు ఆభరణాలను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి.దుర్గా భవాని గురువారం తనిఖీ చేశారు. సహాయకునిగా అప్రైజర్ శ్రీనివాసరావు వ్యవహరించారు. భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, అర్చకులు వెంకట్రామాచార్యులు, వేణుగోపాలాచార్యులు, అప్పలాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాపారావుకు ఆత్మీయ సత్కారం

కోడూరు : సర్పంచ్‌ల సమస్యలపై చిలకలపూడి పాపారావు నిరంతరం పోరాటాలను చేస్తున్నారని పిట్టలంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు అన్నారు. పిట్టలంక గ్రామంలో గురువారం పర్యటించిన చిలకలపూడి పాపారావును గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య, మోపిదేవి మండల అధ్యక్షుడుపూషడపు రత్నగోపాల్, గ్రామ ఉపసర్పంచ్ బావిశెట్టి ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు లంకే భాస్కరరావు, రేవు సువర్ణ రాజు, అంద్రాజు శ్రీనివాసరావు, తోట రాజేష్, కొల్లూరు కోటేశ్వరరావు, గుత్తి రామకృష్ణ, కొప్పనాతి అంజి, మణికంఠ, మర్రే గోవర్ధన్ రావు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఘంటసాల : శ్రీకాకుళంలోని కృష్ణానది ఒడ్డున పుష్కర ఘాట్ సమీపంలో కొడాలి గ్రామానికి చెందిన జంపాని మల్లికార్జునరావు (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై కె.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు కలరు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

గుడివాడ : ఎన్‌టిఆర్ టూ వైఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని లింగవరంలోని కె-కన్వెన్షన్ హాల్‌లో గురువారం ప్రారంభించారు. నాని మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎడ్ల, కోడి పందాలు, ముగ్గుల పోటీలను నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తొలి రోజు ప్రదర్శనలో పాల్గొన్న పశుపోషకులకు జ్ఞాపికలను అందజేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపందేలకు అనుమతి లేదు

చల్లపల్లి/అవనిగడ్డ : అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో కోడిపందేలు, పేకాటకు ఎలాంటి అనుమతులు లేవని, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అవనిగడ్డ డీఎస్పీ పి. మురళీధర్ స్పష్టం చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

మచిలీపట్నం టౌన్ : పల్లెతుమ్మలపాలెంలో గురువారం పోలీసులు బెల్టుషాపుపై దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.